క్లుప్తంగా

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

మాజీ కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి



ఫ్లోరింగ్ పనులను పరిశీలిస్తున్న రాజేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది

మీర్‌పేట: దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార దేవాలయ ఆవరణలో రూ.16.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఫ్లోరింగ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఆలయ ఆవరణ మొత్తం గ్రానైట్ వేయిస్తున్నామని, బ్రహ్మోత్సవాలకు ముందే పనులను పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వరచారి, సిబ్బంది శ్రీకాంత్, అశోక్ ఉన్నారు.

పన్నుల భారం తగ్గించాలని వినతి

మీర్‌పేట: జీహెచ్ఎంసీ, బడంగ్‌పేట మాదిరిగానే మీర్‌పేటలో పన్నుల విధానాన్ని అమలు చేసి, ప్రజలపై భారం తగ్గించాలని మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు సీడీఎంఏ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరం మధ్యలో ఎటువంటి ప్రకటన లేకుండానే ఇంటి పన్నులను ప్రభుత్వం పెద్దఎత్తున పెంచిందన్నారు. గతంలో ఇలాగే పెంచినప్పుడు అప్పుడు మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి పెంచకుండా చేశారని గుర్తుచేశారు. గత నెలలోనే ఎమ్మెల్యే సీడీఎంఏకు ప్రత్యేకంగా లేఖను పంపారని, త్వరలోనే పన్నుల భారం తగ్గనుందని ఆయన తెలిపారు. ఇంటి పన్నుల విషయంలో బీజేపీ నాయకుడు శ్రీరాములుయాదవ్ ఎమ్మెల్యేపై అవగాహన లేకుండా మాట్లాడటం సరైందికాదని, చౌకబారు విమర్శలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొక్క రాజేందర్‌రెడ్డి, అనిల్‌యాదవ్, సిద్దాల బీరప్ప, రజాక్, నాయకులు జటావత్ శ్రీనునాయక్, సిద్దాల అంజయ్య, దోమలపల్లి రాజ్‌కుమార్, జమాల్‌పూర్ సునీత బాలరాజు, మాదరి రమేశ్, విజయలక్ష్మి, శిశు పాల్‌రెడ్డి, సిరూర్ బాలరాజు తదితరులు ఉన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకారం

రాష్ట్ర పర్యాటక సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



పూజలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథ దేవస్థాన అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, రాష్ట్ర పర్యాటక సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం అమావాస్య సందర్భంగా దేవస్థానంలో గోల్డెన్ వాకర్స్ టీం(ఆర్య వైశ్య గ్రూప్) ఆధ్వర్యంలో 500 మంది భక్తులకు నిర్వహించిన అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనతి కాలంలోనే ప్రతి రోజు 200 మందికి భక్తిశ్రద్ధలతో నిత్యాన్న దానం చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న దేవాలయ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. శ్రీలక్ష్మీ కన్వెన్షన్ ఫంక్షన్‌హాల్స్ అధినేత సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్తా, గడ్డిఅన్నారం ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వరగంటి వేణుమాధవ్‌గుప్తా, గోల్డెన్ వాకర్స్‌టీం నా యకులు ఎన్టీఆర్ కృష్ణ,నగేశ్‌గుప్తా, సాంబమూర్తి, కూర శ్రీనివాస్‌గుప్తా, చోలేటి ఆనంద్‌గుప్తా, కబీర్దాస్‌గౌడ్, జక్కుల శ్రీశైలం పాల్గొన్నారు.

నిర్మాణాలపై తాపీమేస్త్రీలకు శిక్షణ

కేశంపేట: నిర్మాణాలపై తాపీ మేస్త్రీలకు హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన పోలేపోగు శేఖర్, సాయిలు వెళ్లారు. శిక్షణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మెలకువలను వివరించారని వారు పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ చాంప్లానాయక్ ధ్రువపత్రాలను అందించారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

చేవెళ్ల: భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బి.శివశంకర్‌మాదిగ అన్నారు. గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పౌరహక్కుల గురించి అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

‘ఉపాధి’కి మరింత భరోసా

ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు కేంద్ర ప్రభుత్వం మరింత ప్రయోజనం కల్పించింది. కూలీల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా గతంలో రూ.300లు చెల్లించగా.. ఏప్రిల్ ఒకటి నుంచి అదనంగా రూ.7 చెల్లించనుంది.



గంగారంలో ఉపాధిహామీ పని చేస్తున్న కూలీలు

- కూలీ రూ.300 నుంచి రూ.307కు పెంపు
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- హర్షం వ్యక్తంచేస్తున్న కూలీలు

మహేశ్వరం: కూలీల వలసలను తగ్గించి, ఉన్న ఊరిలోనే పని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కూలీలకు అందించే వేతనాన్ని ఏటా పెంచుతూ మరింత భరోసాను కల్పిస్తోంది. తాజాగా రూ.7 పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు రోజువారీగా రూ.300 కూలీ చెల్లిస్తుండగా, ఏప్రిల్ ఒకటో తేది నుంచి రూ.307 ఇవ్వనుంది. దీంతో కార్మిక కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూరనుంది.

రూ.87.50 నుంచి 307కు

2005లో ఉపాధిహామీ పథకం ప్రారంభం అయింది. మొదట్లో కూలీలకు రూ.87.50 చెల్లించేవారు. 2022లో రూ.12 పెంచగా, 2023లో గరిష్ఠంగా కూలీని రూ.272, 2024లో రూ.300, 2025–2026 ఆర్థిక సంవత్సరానికి రూ.307గా కేంద్రం నిర్ణయించింది. ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కొత్త వేతనాలు అమలు చేస్తోంది.

జాబ్‌కార్డులు 6,576

మహేశ్వరం మండలం 30 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. మొత్తం జాబ్‌కార్డులు– 6,576, కూలీలు– 9,242, పని చేసిన చేస్తున్న కుటుంబాలు 1,004 ఉన్నాయి. పథకం కింద గ్రామాల్లో చెరువుల పూడిక తీత, కాల్వల పూడిక తీత, కాల్వల మరమ్మతు, వనమహోత్సవం కింద చెట్లు నాటడం, భూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పనుల కొలతల ప్రకారమే ప్రభుత్వం కూలీలకు వేతనం చెల్లిస్తుంది.

ఇతర పనులపై మొగ్గు

కూలీ రేట్లు ఏటా పెంచుతున్నా.. కూలీలు మాత్రం ఉపాధి పనులపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపే వారు. ప్రస్తుతం రూ.307 కూలీ చెల్లిస్తున్నా.. పనుల కొలత ప్రకారమే కూలీ ఇస్తుండడంతో కూలీలకు పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. ఇదిలా ఉండగా.. ప్రైవేట్ సెక్టార్లలో కూలీల కొరత ఉండటం, కూలీ రూ.500 నుంచి 700 చెల్లిస్తుండటంతో ఉపాధి కూలీలు అటువైపు మొగ్గుచూపుతున్నారు. ఇక వ్యవసాయ పనుల సమయంలో కూలీలకు డిమాండ్ పెరగడంతో పాటు, డబ్బులు ఎక్కువగా ఇవ్వడమే కాకుండా.. రైతులు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో కూలీలు అటూ వెళ్తున్నారు. ఉపాధి కూలీ తక్కువగా ఉండటమే ఇందుకు కారణం కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం తెచ్చింది. ఉపాధిహామీ పనులు చేసిన వారికే ఈ పథకానికి అర్హులంటూ నిబంధన పెట్టింది. దీంతో ఉపాధిహామీ పనులు చేయడానికి కూలీలు ఆసక్తి చూపుతున్నారు.

కూలీల సంఖ్య పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు



పెద్దమ్మతండాలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి

ఉపాధిహామీ పథకం కూలీల సంఖ్య పెంచేందుకు సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు మండల పరిధి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామ సభలు, దప్పు చాటింపు చేయిస్తున్నారు. ప్రభుత్వం అందించే కూలీ, ఇతర అలవెన్సుల గురించి వివరిస్తున్నారు.

హర్షణీయం



ఉపాధిహామీ పథకంలో తక్కువ కూలీ నుంచి పని చేస్తున్నాను. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీని రూ.300 నుంచి రూ.307కు పెంచడం హర్షణీయం. పెంచిన కూలీతో కూలీలకు కొంతమేర మేలు జరగనుంది. కూలీలందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఇస్లావత్ బుజ్జి, కూలీ, పెద్దమ్మతండా

శుభపరిణామం



కూలీ పెంచడం శుభపరిణామం. మా గ్రామంలో ఉపాధిహామీ కింద చెరువుల పూడిక తీత, వనమహోత్సవం కింద చెట్లు నాటడం తదితర పనులు చేపట్టాం. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పని చేస్తాం. కూలీ పనులను సద్వినియోగం చేసుకుంటున్నాం.

– దేశపాగ భూషణ్, కూలీ, నందుపల్లి

సద్వినియోగం చేసుకోండి



ఉపాధిహామీ జాబ్ కార్డు కలిగిన వారందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థికంగా ఎదగడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కూలీ రేట్లు పెంచింది. దీంతో కూలీలకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం

పన్ను భారంతో ప్రజలు సతమతం



దీక్షలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- వెంటనే వెనక్కి తీసుకోవాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: పేద, మధ్య తరగతి ప్రజలపై పన్ను భారం మోపడం మంచిది కాదని, దాని వలన వారు ఇబ్బంది పడుతున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పన్ను పెంపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఇంటి పన్ను తగ్గించాలని బీజేపీ ఆధ్వర్యంలో మీర్‌పేటలో చేపట్టిన నిరాహార దీక్ష శనివారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రాష్ట్రాన్ని దివాలా తీశాయని, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీక్షలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్, కొలన్ శంకర్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, సోమేశ్వర్, గాజుల మధు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం రిలే దీక్షను విరమించారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



పహాడీషరీఫ్: ఇఫ్తార్ విందులో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి

పహాడీషరీఫ్: రంజాన్ మాసం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ నాయకుడు హబీబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఆ పార్టీ మహేశ్వరం నియోజవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లింలకు పండ్లు తినిపించి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, నాయకులు యూసుఫ్ ఖాద్రీ, బుడుమాల యాదగిరి, మస్న రవి, కల్యాణ్ యాదవ్, ఇస్మాయిల్, నర్సింహాచారి, ఫజల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..



తుక్కుగూడ: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

తుక్కుగూడ: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ పురస్కరించుకొని శనివారం రావిర్యాల జామ మసీద్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఉపావాస దీక్ష అనంతరం విందు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు సయ్యద్‌సాబేర్ హుస్సేన్, రషీద్, ఇమామ్, బషీర్, వహీద్, కరీం, రహీం, అసద్, తదితరులు పాల్గొన్నారు.

జేపీదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జేపీదర్గాను శనివారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మతసామరస్యాలకు జేపీదర్గా ప్రతీకగా నిలుస్తోందన్నారు. బాబా దర్శనం కోసం ముస్లింలతో పాటు హిందూవులు కూడా అధిక సంఖ్యలో వస్తుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, దర్గా పెద్దలు పాల్గొన్నారు.

ప్రకృతి సమ్మిళిత వేడుక ఉగాది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఉగాది పండుగ ప్రకృతి సమ్మిళితమైన వేడుక అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని గ్రేడ్ 1 గ్రంథాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. శుభాలతో జీవితాన్ని శోభాయమానం చేసేందుకు కొత్త సంవత్సరం అడుగిడబోతుందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర ఎనలేనిదన్నారు. ఉగాదికి పంచాంగ శ్రవణం ఎంత ముఖ్యమో కవి సమ్మేళనం అంతే ముఖ్యమన్నారు. ఉగాది ఉషస్సులు విరబూయాలని, సమసమాజ స్థాపనకు నడుం బిగించాలని, అసమానతలు తొలిగిపోవాలని, భిన్నత్వంలో ఏకత్వమై సాగాలని ఈ సందర్భంగా కవులు తమ కవితలు వినిపించారు. అనంతరం సమ్మేళనంలో పాల్గొన్న కవులను శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, తాండ్ర విశాల, బండారి రమేశ్, వెంకట్‌రాంరెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి, నక్కబాల్‌రాజ్, గంగిరెడ్డి, మాధవులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య హోమం



కందుకూరు: హోమం నిర్వహిస్తున్న భక్తులు



పహాడీషరీఫ్: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు: సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే పనులు చేసేవారి పట్ల భగవంతుడి కృప ఎల్లప్పుడూ ఉంటుందని, అందరూ సత్కర్మలు చేస్తూ ప్రశాంతంగా జీవించాలని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి సూచించారు. అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో శనివారం గురూజీ ఆధ్వర్యంలో భక్తుల సమస్యలు, ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆయన ప్రవచనాలు చేశారు. భగవంతుడిని నమ్ముకుంటే అంతా మంచే జరుగుతుందన్నారు. మానవ సేవయే మాధవ సేవ అన్నారు. కాగా హోమం అనంతరం భక్తులకు గురూజీ ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

అన్నదానం

పహాడీషరీఫ్: అమావాస్య సందర్భంగా జల్‌పల్లి గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మ తల్లి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు యంజాల అర్జున్, దూడల శ్రీనివాస్‌గౌడ్, సిద్దు, రఘురెడ్డి, వెంకటేశ్‌నాయక్, బాబునాయక్, గంగునాయక్, వీరేశం, విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, భాష, శంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల, జెన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో అమావ్యాస సందర్భంగా వైభవంగా స్వామివారి పల్లకీసేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ అమావ్యాస రోజు ఈ ఆలయంలో నక్షత్ర హారతి కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అనంతరం స్వామివారి పల్లకిని ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.